# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పురపాలక శాఖను అన్ని శాఖల సాఫ్ట్‌వేర్ తోను అనుసంధానం చేస్తామని పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు.
- ❖ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను విధిగా పాటించాలని హోం మంత్రి వంగల పూడి అనిత స్పష్టం చేశారు.
- ❖ రాష్ట్రంలో రహదారులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.
- ❖ ఉచిత ఇసుక విధానం అమలులో పారదర్శకంగా వ్యవహరించాలని రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ " కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

====================

నిర్మాణ రంగం అభివృద్ధికి అధికారులతో సమీక్షిస్తున్నట్టు పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. ఈరోజు కృష్ణా జిల్లా కంకిపాడులో మొదలైన “క్రెడాయ్ సౌత్‌కాన్ 2024” కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బిల్డర్లను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ... బిల్డర్లకు అనుమతుల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తీసుకొస్తామన్నారు. మున్సిపల్ శాఖతో అన్ని శాఖల సాఫ్ట్ వేర్‌లను అనుసంధిస్తామని, సింగిల్ విండో అనుమతులకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి 60 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని, వీలైనంత త్వరలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా అమరావతి నిలుస్తుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

====================

పారిశ్రామిక వేత్తలు వారి సంస్థల్లో భద్రతా ప్రమాణాలను తప్పక పాటించాలని హోం మంత్రి వంగల పూడి అనిత అన్నారు. అనకాపల్లిలో ఈరోజు ఆమె పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదలపై తీసుకోవలసిన చర్యలు తదితర

అంశాలపై పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అచ్యుతాపురం సెజ్ లో ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాద ఘటనలో 17 మంది మరణించడంతో పాటు 20 మందికి తీవ్ర గాయాలు, 18 మందికి స్వల్ప గాయాలు కావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. బల్క్ డ్రగ్స్ పరిశ్రమలలో రియాక్టర్ వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. సంఘటన జరిగిన వెంటనే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ లతో పాటు జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తమై బాధితులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పారిశ్రామికవేత్తలు సేఫ్టీ పద్ధతులను పాటించాలని, ప్రాణ నష్టం జరక్కుండా పారిశ్రామికవేత్తలు సహకరించాలని మంత్రి కోరారు.

====================

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి ఈరోజు ఏలూరు జిల్లాలో రహదారి నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం చింతలపూడి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానిక శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ రూపొందించిన జనహితం యాప్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో రహదారులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే రోడ్లతో పాటు ప్రతి నియోజకవర్గంలో 10 నుంచి 20 కోట్ల రూపాయలతో ఆర్ అండ్ బి రోడ్లను అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో ఉన్నామని, అయితే ఇందుకు కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ... రోడ్ల అభివృద్ధిలో భాగంగా తొలి విడతగా వర్షాకాలం అనంతరం రోడ్లకు మరమ్మత్తులు చేపడతామని, వచ్చే ఏడాది నుంచి రోడ్ల నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

====================

రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఈరోజు విశాఖ జిల్లాలో పర్యటించి, అగనంపూడి వద్ద ఏర్పాటు చేసిన ఇసుక డిపోను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. డిపోలో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించి, ఇసుక నిల్వలు, సరఫరా విధానం, బుకింగ్ ప్రక్రియ ఇతర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోడింగ్, బుకింగ్ ప్రక్రియలు వేర్వేరుగా నిర్వహిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం అమలులో పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సమీపంలో ఉన్న పినమడక సచివాలయాన్ని సందర్శించి, అక్కడి బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 113వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్‌లు, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. “మన్ కీ బాత్” హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

విరామం

====================

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ - క్షేత్ర ప్రచార శాఖతో కలిసి విశ్వవిద్యాలయంలో ఈరోజు “ఏక్ పేడ్ మా కే నామ్” (తల్లి పేరిట మొక్క నాటడం) కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంజినీరింగ్ కళాశాల పరిసరాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా

ఉపకుపలతి మాట్లాడుతూ... అధిక కాలుష్య ప్రభావంతో అనారోగ్య సమాజం ఏర్పడుతోందన్నారు. పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో "ఏక్ పేడ్ మాకే నామ్" లో భాగంగా మొక్కలు విరివిగా నాటడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

====================

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి... ప్రజారోగ్యం, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రస్తుత సమయంలో గత 4 నెలల్లో 26 మంది నవజాత శిశువులు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. శిశువులు పుట్టినప్పటి నుండి వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షించాలని, నవజాత శిశు మరణాలు గణనీయంగా తగ్గాలని ఆమె సూచించారు. స్త్రీ గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవం అయ్యే వరకు సంబంధిత వైద్యులు మాత-శిశు సంరక్షణకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్య సహాయాన్ని అందించాలన్నారు.

====================

ప్యారిస్ నగరంలో జరిగే పార ఒలంపిక్స్ ముగింపు వేడుకల కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వాసి వేలాయుధం శ్రీనివాసులుకు అవకాశం లభించింది. ఒలంపిక్స్ వేడుకల ముగింపు కార్యక్రమంలో ప్రఖ్యాత కలంకారీ కళను ప్రదర్శించే అవకాశం ఆయనకు లభించింది. సెప్టెంబరు 5 నుంచి 9వ తేది వరకు పార ఒలంపిక్స్ వేడుకలు జరుగనున్నాయి. భారతదేశంలోని 5 రాష్ట్రాల నుంచి 5 విభిన్న కళలలో ప్రతిభావంతులైన 5 గురు కళాకారులకు మాత్రమే ప్రదర్శనలో పాల్గొనేందుకు అవకాశం లభించగా... కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి శిల్పగురు అవార్డు గ్రహీత వేలాయుధం శ్రీనివాసులను ఎంపిక చేసింది. ఈ సందర్భంగా వేలాయుధం శ్రీనివాసులు ఆకాశవాణితో మాట్లాడుతూ... తనకు లభించిన ఈ అరుదైన అవకాశం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

(వాయిస్ 22 సెకన్లు)

====================

చంద్రయాన్ -3 విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ అంతరిక్ష వారోత్సవాల నేపధ్యంలో తిరుపతి జిల్లా గూడూరులోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన అంతరిక్ష విశేషాల ఫోటో ఎగ్జిబిషన్ కు మంచి స్పందన లభిస్తోంది. కార్యక్రమంలో భాగంగా డి.ఆర్.డబ్ల్యూ కళాశాల విద్యార్థినులు ప్రత్యేక అవగాహన ర్యాలీని ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మన ఆలోచనలే విజయాలకు మెట్లుగా నిలుస్తాయన్నారు.

====================

డ్రాప్ అవుట్స్ ను నివారించడానికి విద్యార్థులను ఓపెన్ స్కూల్ సొసైటీ లో చేర్పించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి సూచించారు. ఓపెన్ స్కూల్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలపై కలెక్టర్ ఈరోజు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బడి ఈడు పిల్లలందరూ పాఠశాలకు వెళ్ళాలన్నారు. పొదుపు మహిళలు, అంగన్వాడి కార్యకర్తలు ఇంటర్మీడియట్ విద్యార్హత పొందేలా ఓపెన్ స్కూల్లో చేరాలని సూచించారు.

====================

ఈ నెల 25వ తేదీ నుండి విశాఖలో ప్రారంభంకానున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీని విజయవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అక్కయ్యపాలెంలోని పోర్టు స్టేడియం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఈరోజు ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ట్రాక్ పునరుద్ధరణ, బారికేడింగ్, లైట్లు, టెంట్లు, క్యూలైన్ల ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు.

=====================

=====================